క్లుప్తంగా

29న సర్వసభ్య సమావేశం

దౌల్తాబాద్: ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 29న ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షకు ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు కాంగ్రెస్ ప్రచారం

తాండూరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలం పరిధి మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మల్కాపూర్, సాయంత్రం 5.30 గంటలకు కరన్‌కోట్‌లో ప్రచారం చేపట్టనున్నారని తెలిపారు. ప్రచారంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా కాటమయ్య జాతర



స్వామివారి సన్నిధికి బోనాలతో మహిళలు

తాండూరు రూరల్: గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కాటమయ్య జాతర గురువారం ఘనంగా జరిగింది. జినుగుర్తిలోని కాటమయ్య ఆలయ 4వ వార్షికోత్సవం గౌడలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. స్వామివారిని ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, రవిగౌడ్, వడ్డెశ్రీను, శ్యామప్పలు దర్శించుకున్నారు. ఇందులో వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లాలయ్యగౌడ్, బాలప్పగౌడ్, ప్రవీణ్‌గౌడ్, నరేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, బాలప్పగౌడ్, నాగప్ప, శ్రీనివాస్, బాల్‌రాజ్ ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

దోమ: బొడ్రాయి, శ్రీపరమేశ్వర, గణపతి, ఆంజనేయ, నవగ్రహ, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలతో మైలారం గ్రామం ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. గురువారం భక్తులు విగ్రహాలకు ఆరాధన, నిత్య హవనం, ధాన్యాధివాసం, రుద్ర మన్యుసూక్త హవనం, తీర్థప్రసాదగోష్టి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు



సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

కొడంగల్: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడారు. పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ గెలుపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, తాలూకా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ నయీం, రాము, అశ్వాక్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకాటుతో మలేరియా



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: దోమ కాటుతోనే మలేరియా జ్వరం వస్తుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రప్రకాష్ మాట్లాడారు. మలేరియా జ్వరం వచ్చినట్లయితే.. కీళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాలు, రక్తహీనత, చర్మం పచ్చగా మారటం తదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం వలన మహమ్మారిని మట్టుబెట్టవచ్చునని సూచించారు. వైద్యురాలు ప్రశాంతి, వైద్య సిబ్బంది యాదమ్మ, విజయలక్ష్మి, వెంకటమ్మ, రత్నమ్మ, సుజాత, జంగమ్మ, గౌరీ, మంగమ్మ, బి.సుజాత, భారతమ్మ, జ్యోతి, శ్రీలత, లింగమ్మ ఉన్నారు.



మోమిన్‌పేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మర్పల్లి: పీహెచ్‌సీ ఆవరణలో మాట్లాడుతున్న డాక్టర్ నేహ

మలేరియాను నిర్మూలిద్దాం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

- దోమల ఉత్పత్తిని అరికడదాం
- అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు

మోమిన్‌పేట: మలేరియా వ్యాధిని సమూలంగా నిర్మూలిద్దామని వైద్యాధికారి సుజల పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మహమ్మారిని 2030 వరకు నిర్మిలించాలని సూచించారు. నీటి నిలువ ఉండకుండా చేయడం వలన దోమల సంతాన ఉత్పత్తిని నిలువరించవచ్చునని ఆమె వెల్లడించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణం పూర్తయిందని, ఆయా గ్రామాల్లో దోమల సంతానోత్పత్తి లేకుండా చూడాలని కోరారు. మురుగు జలాలు నిలువ ఉన్న ప్రదేశాల్లో దోమలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అందుకు మన చుట్టూ ఉన్న పరిసరాల్లో నీరు నిలువ ఉండ కుండా చూసుకోవాలని సుజల కోరారు.

మర్పల్లిలో..

మర్పల్లి: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని నేహ సూచించారు. మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీశారు. అనంతరం ఆమె మాట్లాడారు. దోమ కాటు వలన మలేరియా జ్వరం వస్తుందని, వ్యాధి భారిన పడకుండా ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో నీటి గుంతలు ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధి కూలీలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: మలేరియా మహమ్మారి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని కోట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ గీతిక పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా వ్యాపించకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు పేర్కొనకుండా చూసుకోవడమే కాకుండా.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పనికి రాని పాత్రలు, పాత టైర్లు, నీటి తొట్లు ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రమ్ములు నీటి తొట్లపై మూతలు పెట్టాలన్నారు. వారానికి ఒకసారి నిలువ ఉన్న నీటిని పారబోసి, కొత్త నీటిని నింపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- అర్హులందరూ వినియోగించుకోవాలి
- తహసీల్దార్ కిషన్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

పెద్దేముల్: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. అది వజ్రాయుధం లాంటిది. అర్హులందరూ తమ హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కిషన్ సూచించారు. గురువారం సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 4వ తేదీ వరకు బీఎల్ఓల ద్వారా ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తామని తహసీల్దార్ కిషన్ వెల్లడించారు. మండల పరిధి కందనెల్లితండా, మారేపల్లితండా, ఖాజాపూర్, ఊరేంటితండా, సిద్దన్నమడుగుతండా, ఎర్రగోడుతండా, జైరాం తండా(ఇందూరు), బండపల్లి గ్రామాలకు కొత్తగా పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. కావున ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి బీజేపీ మండల అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలు ఉధృతం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు

షాద్‌నగర్: మేడే స్ఫూర్తితో కార్మిక పోరాటాలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అన్నారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పర్వతాలు మాట్లాడారు. ఎంతో కాలం పోరాటాలు చేసి, సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్మికుల చట్టాలను నాలుగు కోడ్‌లోకి మార్చడం దారుణమని విమర్శించారు. పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని, ప్రమాదకరమైన యంత్రాల మధ్య పని చేసే శ్రామికులకు యజమాన్యాలు కనీసం రక్షణ కవచాలు అందించడం లేదని ఆరోపించారు. కార్మికుల పక్షాన నిలబడాల్సిన కేంద్రం ప్రభుత్వం.. పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడం కోసం మేడేను పోరాట దినంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం కార్మికులందరూ కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనునాయక్, లింగంనాయక్, రాజు, రవి, మధన్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



సమాజం నూతన కమిటీ సభ్యులు

కొడంగల్ రూరల్: వీరశైవ సమాజం సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని సమాజం సంఘం తాలూకా కమిటీ నూతన అధ్యక్షుడు కొవ్వూరు విజయవరద్ధన్ కోరారు. పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో గురువారం వీరశైవ సమాజం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమాజం నియోజకవర్గ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా మఠాధిపతులు శ్రీజగద్గురు సిద్ధిలింగ మహాస్వామి, గౌరవ అధ్యక్షుడిగా ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, అధ్యక్షుడిగా కొవ్వూరు విజయవదర్ధన్, ఉపాధ్యక్షులుగా బర్ల శ్రీశైలం, ఆవుటి సోమయ్య, కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా దౌల్తాబాద్ మల్లేశం, కోశాధికారిగా సూరారం రాకేష్, కార్యదర్శులుగా వద్ది శరణయ్య, జాజిం భరత్‌కుమార్, పి.శివశంకర్, ఆవుటి సిద్దప్ప, న్యాయ సలహాదారుడిగా న్యాయవాది జాధవరావు, గౌరవ సలహాదారునిగా నందర్‌పూర్ మల్లికార్జున్, ఆవుటి మల్లేశ్, ఆర్.బస్వరాజ్, సిద్దిలింగప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విజయవర్ధన్ మాట్లాడారు. సభ్యులు సంఘటితంగా విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

నేడు 'డీకే' ర్యాలీ

బొంరాస్‌పేట: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి డీకే అరుణ ప్రచార రథం నియోజకవర్గానికి రానుందని వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, పార్టీ నాయకుడు శ్రావణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ప్రచార రథం తిరగనుందని చెప్పారు. ఉదయం గుండుమాల్, హన్మాస్‌పల్లి, 11గంటలకు దౌల్తాబాద్, సాయంత్రం 4గంటలకు బొంరాస్‌పేట మండల కేంద్రంలో ప్రచార రథం ర్యాలీ కొనసాగుతుందని, అనంతరం దుద్యాల మండల కేంద్రానికి వెళ్లనుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

మచ్చలేని నాయకుడు 'కొండా'

- లోక్‌సభ ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయం
- ధీమా వ్యక్తంచేసిన బీజేపీ శ్రేణులు



ధారూరు: గట్టెపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



మర్పల్లి: పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రామేశ్వర్‌రెడ్డి

ధారూరు: రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బలపర్చి, కమలం గుర్తుకు ఓటు వేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడి, సీనియర్ నాయకులు పాండుగౌడ్‌లు కోరారు. గురువారం మండల పరిధి గట్టెపల్లి రుద్రారం, గట్టెపల్లితండాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు. పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన పనుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేసిన ఘనత ప్రధానికే దక్కుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కు లేదని, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిని హస్తం నేతలే ఇష్టపడటం లేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కమలం గుర్తుకు ఓటు వేసి, కొండాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, వికారాబాద్ అసెంబ్లీ ఎస్టీ ఎన్నికల ఇన్‌చార్జి రాజునాయక్, నాయకులు రాఘవేందర్‌గౌడ్, సాయిగౌడ్, రవీందర్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదీకి కానుకగా.. చేవెళ్ల

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన వారు బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కొండాను గెలిపించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండల పరిధి మొగిలిగుండ్ల గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్, పెద్ద సంగమేశ్, వినేష్‌కుమార్, చిన్న సంగమేశ్, వారి అనుచరులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రామేశ్వర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మణ్, మధుకర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా గురుకులాలు

- అత్యుత్తమంగా రాణించిన విద్యార్థులు
- ప్రిన్సిపాల్ ఇఫ్పాత్ జాన్



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఇఫ్ఫాత్ జాన్

తాండూరు టౌన్: ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా గురుకుల కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఇఫ్పాత్ జాన్ తెలిపారు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను గురువారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకుంటున్న గురుకులాల్లో ఉత్తమ బోధన అందిస్తున్నామని చెప్పారు. టీఎస్ మైనారిటీ తాండూరు (బాలికల) కళాశాలలో ముస్కాన్ షరీఫ్ బైపీసీ మొదటి సంవత్సరంలో 434 మార్కులు, సుహానా బేగం ఎంపీసీలో 463, సమ్మీ బేగం, నదియా నిమ్రా ఎంపీసీ సెకండియర్‌లో 974, హఫ్సా మసీరా బైపీసీలో 940 మార్కులు సాధించినట్లు ఆమె వెల్లడించారు. మైనారిటీ తాండూరు (బాలుర) కళాశాలలో మోసిన్ ఎంపీసీ ఫస్టియర్‌లో 445, ఎండీ రేహాన్ బైపీసీలో 416, మైనారిటీ కొడంగల్ (బాలుర) కళాశాలలో ఆరిఫ్ సీఈసీ 466, షేక్ జమీర్ హెచ్ఈసీ 416, వరుణ్ కుమార్ సీఈసీ సెకండియర్‌లో 934, నజీర్ హెచ్ఈసీలో 879 మార్కులు రాబట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు, సహచరులు అభినందించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ తదితరులు

పరిగి: మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నట్లు మున్సిపల్ చైర్మన్ ముకంద అశోక్‌కుమార్ తెలిపారు. 10వ వార్డు శ్రీనివాస కాలనీలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. కాలనీకి నీటి సరఫరాలో అంతరాయం కలగడంతో పైప్‌లైన్‌మరమ్మతు చేయిస్తున్నట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ నాగేశ్వర్, శ్రీనివాస్, వెంకటేశ్, మునీర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



కొడంగల్: ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

వంశీచంద్‌ను గెలిపించాలి
ఓటర్లను వేడుకున్న హస్తం శ్రేణులు

కొడంగల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తోంది. గురువారం ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నాయకులు నయీమ్, ఆసిఫ్‌ఖాన్, దాము, మురహరి వశిష్ఠ తదితరులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ఓటర్లకు వివరించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రకటించిన హామీలను వివరిస్తూ.. పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దౌల్తాబాద్‌లో..



దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల పరిధి గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు ఆధ్వర్యంలో దౌల్తాబాద్, దేశాయిపల్లి, బిచ్చాల, సురాయిపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన హామీలను ప్రజలకు వివరించారు. పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, రెడ్డి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రాములు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో 'కారు' నేతలు చేరిక

కొడంగల్: బీఆర్ఎస్ పార్టీ కోస్గి మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, బిజ్జారం ఎంపీటీసీ బాల్‌రాజ్, మాజీ ఎంపీటీసీ హన్మంత్, బొల్వంపల్లి, ముశ్రీఫా, పోలీపల్లి మాజీ సర్పంచులు కొండారెడ్డి, వెంకట్‌రాములు, రామకృష్ణారెడ్డి తదితరులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పార్టీలో చేరిన వారికి హస్తం కండువాలు కప్పి ఆహ్వానించారు. గతంలో వీరు బీఆర్ఎస్‌లో కీలకంగా పనిచేశారు. ఆ పార్టీ కోస్గి మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి.. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి సమీప బంధువు కావడం గమనార్హం.



పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న తిరుపతిరెడ్డి

మొక్కలు ఎండిపోకుండా చూడండి



నర్సరీని పరిశీలిస్తున్న అధికారి గీత

పంచాయతీ ప్రత్యేక అధికారి గీత

మోమిన్‌పేట: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా.. వాటి పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి గీత అన్నారు. గురువారం మండల పరిధి ఎన్కేపల్లిలోని నర్సరీని ఆమె పరిశీలించి మాట్లాడారు. వేసవి కావడంతో నీటి ఎద్దడి ఉంటుందని, మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం నీటిని పట్టడం వలన మొక్కలు త్వరగా ఎదుగుతాయని చెప్పారు. వానాకాలంలో నాటేందుకు లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా బోరు మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని వెల్లడించారు. మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయాలని, వాటర్ ట్యాంకర్లను పక్షం రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని జీపీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి, కారోబార్ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓట్ల కోసం కులమతాల మధ్య బీజేపీ చిచ్చు

- కాంగ్రెస్ గెలుపుతో రాష్ట్రానికి బీఆర్ఎస్ పీడ వదిలింది
- పీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్

షాద్‌నగర్ రూరల్: ఓట్లకోసం బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతుందని పీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్ బాబర్ ఆరోపించారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలను రెచ్చగొట్టేందుకు ఆ పార్టీ నాయకులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో రాజస్థాన్‌లో ప్రధానమంత్రి మోదీ మహిళల పుస్తెల గురించి మాట్లాడి, వారిని కించపరిచారన్నారు. కాంగ్రెస్ పేదల పార్టీగా నిలిచిందని, ఎంతో మంది నిరుపేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన ఘనత మాకే దక్కుతుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య సమయంలో ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు బ్రిటీష్ పాలకుపై పోరాటం చేసి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. దేశ భక్తులమని చెప్పుకునే బీజేపీ నాయకులు ఎంతమంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారో చెప్పాలని ప్రశ్నించారు. దేవుళ్ల పేరుతో ఓట్లు అడిగే బీజేపీ.. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి పదేళ్లుగా పట్టిన బీఆర్ఎస్ పీడ వదిలిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గెలిచింది, రాష్ట్రంలో కరువు వచ్చిందని మాట్లాడుతున్న బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఎంపీగా గెలిచిన మన్నె ఎన్నిసార్లు నీ నియోజకవర్గానికి వచ్చావు, ఎన్ని నిధులు తీసుకువచ్చావో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటువేస్తే బీజేపీకి వేసినట్లేనని వెల్లడించారు. ప్రజలు ఆ పార్టీల చీకటి ఒప్పందాన్ని గమనించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.